APTEL/2009/29308

స్నేహిత

# ఎక్స్‌ప్రెస్

నిజం దాగదు.. వార్త ఆగదు

తెలుగు దినపత్రిక

17-07-2026
శుక్రవారం
హైదరాబాద్
సంపుటి: 17 I సంచిక: 263
పేజీలు: 04 I వెల: 5/-
ఎడిటర్: రాథోడ్ వినోద్ కుమార్

FOLLOW:
https://epaper.expresstelugudaily.com



## స్పేస్ రంగంలో నవ శకం

2

## గోల్కొండలో ఆషాఢం సందడి



- కనుల పండువగా ప్రారంభమైన బోనాలు
- రాష్ట్ర ప్రభుత్వం తరపున లంగర్‌హౌస్ నుంచి బంగారు బోనం
- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్న మంత్రులు పొన్నం, కొండా సురేఖ

2



## తెలంగాణ వ్యవసాయ శాఖకు అరుదైన ఘనత

- రాజేంద్రనగర్ ఎఫ్‌సీఓ ల్యాబ్‌కు అంతర్జాతీయ గుర్తింపు
- ఎన్‌ఏబీఎల్ గుర్తింపు సాధించిన మొదటి ప్రయోగశాల ఇదే కావడం విశేషం
- రైతులకు నాణ్యమైన వ్యవసాయ ఉత్పాదకాలు అందించడమే.. ప్రభుత్వ ప్రధాన లక్ష్యం
- రాబోయే రోజుల్లో అన్ని ల్యాబ్‌లను అంతర్జాతీయ స్థాయికి చేర్చి రైతు సంక్షేమానికి కట్టుబడి ఉంటాం: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

2



- రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోంది
- రూ.3,500 కోట్ల అంచనా వ్యయంతో ప్రణాళిక రూపొందించాం
- దీనిద్వారా 4లక్షల ఎకరాలకు సాగునీరు అందనుంది

# సీతారామ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేస్తాం

### గోదావరిపై చివరి ప్రాజెక్ట్ ఇది.. దీనిపై ఆర్థిక భారం పడింది..

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో దుర్మార్గంగా ఆలోచించి బడ్జెట్ పెంచి ప్రాజెక్టును రీడిజైన్ చేశారు

గోదావరిపై జరుగుతున్న అక్రమాలపై ఆనాడు శాసనసభలో, బయట కూడా గళం విప్పాం

పెద్ద ఎత్తున ఖర్చు చేసిన ఈ ప్రాజెక్టును పూర్తిచేయాలని సీఎం రేవంత్ పట్టుదలతో ఉన్నారు

ఇప్పటివరకు ఎంతమేర పనులు పూర్తయ్యాయో చూసేందుకు ఈ పర్యటన చేపట్టాం

ప్రజా ప్రభుత్వంలో ఒక్క పైసా కూడా దుర్వినియోగం కాకుండా ప్రాజెక్టును పూర్తిచేస్తాం


డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

పెండింగ్ ప్రాజెక్టులు దశలవారిగా పూర్తిచేస్తాం

సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు అత్యంత కీలకమైన సాగునీటి ప్రాజెక్టు

రాష్ట్ర నీటిపారుదల,మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి

2



## సేఫ్ సిటీతో.. మరింత భద్రత

- మహిళల భద్రత, రోడ్ల భద్రతపై ప్రత్యేక దృష్టి
- 2,306 సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి ఇప్పటికే అందుబాటులోకి తెచ్చాం
- సీసీటీవీ కెమెరాలన్నీ ఎల్లప్పుడూ పనిచేసేలా నిరంతర పర్యవేక్షణ ఉండాలి
- సాంకేతిక ఆధారిత పోలీసింగ్‌ను బలోపేతం చేయాలి
- మహిళల సౌకర్యార్థం నగరంలో 12 మొబైల్ షీ టాయిలెట్లను ఏర్పాటు
- పాదచారుల భద్రత కోసం ఉన్న 77 ప్రాంతాల్లోని సిగ్నల్స్ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- వివిధ శాఖల ఉన్నతాధికారుల సమన్వయ సమావేశం లో డీజీపీ సీవీ ఆనంద్

2

## పూరీ జగన్నాథ రథయాత్రలో తొక్కిసలాట

- ఇద్దరు మృతి, 100 మందికి పైగా గాయాలు
- భక్తులను ఆకట్టుకుంటోన్న జగన్నాథుని సైకత శిల్పం



2



## 9వ తరగతిలో మూడో భాష వద్దు

- దీనివల్ల విద్యార్థులపై ఒత్తిడి పెరుగుతుంది
- ఏదైనా కొత్త భాషను ఐదు లేదా ఆరో తరగతిలోనే ప్రవేశపెట్టాలి
- సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

2

విలేకరులు కావలెను

స్నేహిత ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
expresstelugudaily.com



Contacts
తెలంగాణ
95500 21491

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

ఎక్స్‌ప్రెస్ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు మండల రిపోర్టర్లు, యాడ్స్ ఏజెంట్స్ వెంటనే కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు..

# సీతారామ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేస్తాం



**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** సీతమ్మసాగర్ బ్యారేజ్, సీతారామ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలను పుష్కలంగా అందిస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. గోదావరి జలాలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకు రావడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం సీతమ్మసాగర్ బ్యారేజ్, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి భట్టి విక్రమార్క క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గోదావరి నదిలో ప్రవహిస్తున్న నీటిని సాధ్యమైనంత మేర పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోందని భట్టి విక్రమార్క వివరించారు. అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో గ్రావిటీ ద్వారా, అవసరమైన చోట లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటిని తరలించే విధంగా ప్రణాళిక అమలు చేస్తున్నట్లు తెలిపారు. మొత్తం సుమారు రూ.3,500 కోట్ల అంచనా వ్యయంతో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ప్రణాళిక రూపొందించినట్లు వివరించారు. రాష్ట్ర విభజనకు ముందు ఈ రెండు ప్రాజెక్టులపై సుమారు రూ.2,000 కోట్ల వరకు వ్యయం జరిగిందని, మిగిలిన పనులకు సుమారు రూ.1,505 కోట్లు అవసరమయ్యే పరిస్థితి ఉండేదన్నారు. అనంతర కాలంలో ప్రాజెక్టు పునఃరూపకల్పనతో అంచనా వ్యయం సుమారు రూ.24 వేల కోట్లకు పెరిగిందని, ఇప్పటికే రూ.7,500-8,000 కోట్ల వరకు వ్యయం జరిగినట్లు వివరించారు. ప్రస్తుతం భారీ ప్రజాధనం ఇప్పటికే వ్యయమైనందున మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసి రైతులకు ప్రయోజనం చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సీతమ్మసాగర్, సీతారామ, దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ వ్యవస్థలను సమన్వయం చేసి గోదావరి జలాలను గరిష్టంగా వినియోగించుకునేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రతి నెలా పనుల పురోగతిని సమీక్షిస్తూ అవసరమైన నిధులు విడుదల చేసి ప్రాజెక్టును నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు అత్యంత కీలకమైన సాగునీటి ప్రాజెక్టు అని అన్నారు. రాష్ట్రంలో ఇరిగేషన్ రంగంపై గతంలో సుమారు రూ.1.81 లక్షల కోట్లకు పైగా వ్యయం జరిగినప్పటికీ అనేక ప్రాజెక్టులు ఇంకా వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై సుమారు రూ.27,500 కోట్లు వ్యయం జరిగినట్లుగా ఉత్తమ్ వివరించారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను దశలవారీగా పూర్తి చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణాలకు సంబంధించి జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ, కేంద్ర జల సంఘం సూచనల మేరకు సాంకేతిక పరీక్షలు, భూగర్భ పరిశీలనలు, నిర్మాణ భద్రతా అధ్యయనాలు కొనసాగుతున్నాయని తెలిపారు. నిపుణుల నివేదికల ఆధారంగా అవసరమైన పునరుద్ధరణ చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజల భద్రత, నిర్మాణ నాణ్యత, నీటి నిల్వ సామర్థ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అన్ని నిర్ణయాలు శాస్త్రీయ ప్రమాణాల ఆధారంగానే తీసుకుంటున్నామని వివరించారు.

## గోల్కొండలో ఆషాఢం సందడి




**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** తెలంగాణ సంస్కృతిని, సంప్రదాయాన్ని ప్రతిబింబించే ఆషాఢమాస బోనాల ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. చారిత్రాత్మకమైన శ్రీ జగదాంబికా మహంకాళి అమ్మవారికి 11 బోనాలతో కుమ్మరులు తొలి బోనం సమర్పించి ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. హైదరాబాద్ లంగర్‌హౌస్ నుంచి ప్రభుత్వం తరఫున బంగారు బోనం, పట్టు వస్త్రాలను మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ సమర్పించారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం రూ. 15.05 కోట్లను ఈ ఉత్సవాల కోసం కేటాయించింది. బోనాలను సమర్పించేందుకు వచ్చిన భక్తులతో గోల్కొండ కోట కిటకిటలాడుతోంది. గోల్కొండ బోనాల వేడుకల్లో భాగంగా మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, స్పీకర్ గడ్డం ప్రసాద్‌తో పాటు పలువురు ప్రముఖులు జగదాంబిక అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పట్టు వస్త్రాలు, బోనం సమర్పించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ పోతురాజుల విన్యాసాల్లో ఉత్సాహంగా పాల్గొని, చేతిలో కొరడా పట్టుకుని నృత్యం చేయడం అందరినీ ఆకట్టుకుంది. కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు అమ్మవారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. బోనాలు ప్రారంభమైన మొదటిరోజే ఎంపీ ఈటల రాజేందర్ వచ్చి మొక్కులు చెల్లించుకొని, ప్రజలందరికి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్ ప్రజల జీవన విధానం, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలిచే బోనాల పండగ ఆధ్యాత్మిక, సాంస్కృతిక మహోత్సవమని ఈటల కొనియాడారు. : ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 2 వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామని హైదరాబాద్ సీపీ సజ్జనర్ తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని రామ్‌దేవ్‌గూడ, లంగర్‌హౌస్, బంజారా దర్వాజా తదితర మార్గాల్లో రాత్రి 10 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు ఉంటాయని సీపీ తెలిపారు. లక్షలాది మంది భక్తులు హాజరుకానున్న నేపథ్యంలో చైన్ స్నాచింగ్, పిక్‌పాకెటింగ్ వంటి నేరాలను నివారించేందుకు హైదరాబాద్ పోలీసులు వినూత్న చర్యలు చేపట్టారు. నగరంలోని మోస్ట్ వాంటెడ్ చైన్ స్నాచర్ల ఫొటోలతో ప్రత్యేక హెచ్చరిక బ్యానర్లను రూపొందించి ప్రధాన కూడళ్లలో ప్రదర్శించారు. ఆభరణాలు, నగదు, ఫోన్ల విషయంలో భక్తులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

## పూరీ జగన్నాథ రథయాత్రలో తొక్కిసలాట

**నేషనల్ బ్యూరో :** ఒడిశాలో గురువారం ప్రారంభమైన జగన్నాథుని రథయాత్రలో అపశ్రుతి జరిగింది. యాత్ర ప్రారంభమైన కొద్ది సేపటికే తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా, అనేక మంది గాయపడ్డారు. అయితే, మృతులకు సంబంధించిన వివరాలు ఇంకా తెలియరాలేదు. భక్తుల రద్దీ విపరీతంగా పెరగడంతో గందరగోళ పరిస్థితి నెలకొందని, ఈ నేపథ్యంలో గ్రాండ్ రోడ్ వద్ద ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. తొక్కిసలాట జరిగిన సమయంలో దాదాపు 120 మందికి శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు పడినట్లు ప్రాథమిక సమాచారం. ప్రత్యేక సహాయ యూనిట్ ఎస్‌ఆర్ యూ బృందాలు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. అస్వస్థతకు గురైన భక్తులను చికిత్స నిమిత్తం పూరీ మెడికల్ ఆసుపత్రికి తరలించాయి. పరిస్థితిని తాము నిశితంగా గమనిస్తున్నామని ఉత్సవానికి హాజరవుతున్న యాత్రికుల భద్రతను పర్యవేక్షించేందుకు అత్యవసర ప్రతిస్పందన చర్యలను ముమ్మరం చేశామని అధికారులు వెల్లడించారు. మరోవైపు, పూరీలో వార్షిక రథ యాత్రను రాజు దివ్యసింగ్ దేవ్ 'ఛెరా పహన్‌రా' కార్యక్రమాన్ని నిర్వహించారు. సంప్రదాయం ప్రకారం వెండి పల్లకిలో ఆలయానికి చేరుకున్న రాజు రథాలపై ఆసీనులైన దేవుళ్లకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పూజారులు మంత్రోచ్చారణ చేస్తుండగా ఆయన జగన్నాథ స్వామి, బలభద్రుడు, సుభద్ర రథాలపై బంగారు చీపురుతో ఊడ్చే క్రతువును నిర్వహించారు. శ్రీక్షేత్ర గోవర్ధన పీఠానికి చెందిన జగద్గురు శంకరాచార్యులు దివ్య రథాలపై ఉన్న దేవతామూర్తులను దర్శించుకున్నారు. అనంతరం లక్షలాది భక్తుల జయజయ ధ్వానాల నడుమ రథయాత్ర సాగింది. స్వామివారి రథం లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. లక్షలాదిగా వచ్చిన భక్తులతో పూరీ గ్రాండ్ రోడ్డు పూర్తిగా నిండిపోయింది. ఓ వైపు జోరుగా వర్షం కురుస్తున్న దాన్ని లెక్కచెయకుండా, భగవంతుని దర్శనం కోసం దాదాపు 2లక్షల మంది భక్తులు పూరీకి చేరుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఒడిస్సీతోపాటు వివిధ కళాకారులు చేస్తున్న సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకుంటున్నాయి. బుధవారం పూరీలో ఏకంగా 143 మిల్లీ మీటర్లకు పైగా వర్షం కురిసింది. గురువారం ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అయిప్పటికీ ఉత్సవాలకు ఆటంకం కలగకుండా, రథాలు సాగే రహదారిలో నీరు నిలవకుండా చర్యలు చేపట్టారు. పూరీ గజపతి మహారాజు దివ్యసింగ్ దేవ్ సంప్రదాయబద్ధంగా బంగారు చీపురుతో రథాలను శుభ్రం చేసిన అనంతరం సాయంత్రం 4గంటలకు భక్తులు రథాల్ని లాగడం ప్రారంభించారు. రెండున్నర కిలోమీటర్ల దూరంలో ఉన్న గుండిచా ఆలయానికి రథాలు చేరుకుంటాయి. పోలీసులతో పాటు కేంద్ర బలగాలు, నావికాదళం, తీర గస్తీ దళాలకు చెందిన 13 వేల మంది సిబ్బందితో పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు.

**భక్తులను ఆకట్టుకుంటోన్న జగన్నాథుని సైకత శిల్పం**

ఇదిలా ఉండగా, పూరీ జగన్నాథుడి రథయాత్ర సందర్భంగా ప్రముఖ సైకత శిల్పి, పద్మశ్రీ అవార్డు గ్రహీత సుదర్శన్ పట్నాయక్ రూపొందించిన జగన్నాథుని సైకత శిల్పం ఆకట్టుకుంటోంది. ఈయన ఒడిశాలోని పూరీ తీరంలో జగన్నాథుడి రూపాన్ని అందంగా తీర్చిదిద్దారు. ప్రధాన శిల్పం చుట్టూ ఇసుకతో దాదాపు 100 చిన్న రథాలను రూపొందించారు. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించడమే లక్ష్యంగా ఆయన ఈ సైకత శిల్పాన్ని రూపొందించారు. ఈ కళాఖండాన్నిదాదాపు 800 ఇసుక బస్తాలను ఉపయోగించి సుమారు 2 వేల 500 చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీర్చిదిద్దారు.

## 9వ తరగతిలో మూడో భాష వద్దు

**నేషనల్ బ్యూరో :** సీబీఎస్ఈ పాఠ్య ప్రణాళికలో భాగంగా మూడో భాష అమలుకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. తొమ్మిదో తరగతిలో కొత్త భాషను ప్రవేశపెట్టడం సరికాదని పేర్కొంది. దీనివల్ల విద్యార్థులపై ఒత్తిడి పెరుగుతుందని అభిప్రాయపడింది. దీనికి బదులు.. ఏదైనా కొత్త భాషను ఐదు లేదా ఆరో తరగతిలోనే ప్రవేశపెట్టాలని ప్రభుత్వానికి సూచించింది. తమిళనాడులో జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు సంబంధించిన పిటిషన్ (సీబీఎస్ఈ అంశంపై కాకుండా) ను విచారించిన జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం త్రిభాషా విధానంపై ఈ విధంగా వ్యాఖ్యానించింది. దేశవ్యాప్తంగా జవహర్ నవోదయ విద్యాలయాల్లో త్రిభాషా విధానం అమలు అవుతున్న విషయం తెలిసిందే. అయితే, ఈ విధానాన్ని వ్యతిరేకిస్తున్న తమిళనాడు ప్రభుత్వం.. వీటిని రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు నిరాకరిస్తోంది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో ప్రతి జిల్లాలో జేఎన్‌వీ ఏర్పాటును సమర్థిస్తూ మద్రాస్ హైకోర్టు ఇటీవల తీర్పు ఇవ్వగా.. దీనిని సవాలు చేస్తూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే, సీబీఎస్ఈలో త్రిభాషా విధానంపై సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలో ప్రత్యేకంగా విచారణ కొనసాగుతున్న విషయం తెలిసిందే.

## స్పేస్ రంగంలో నవ శకం

**నేషనల్ బ్యూరో :** భారత అంతరిక్ష రంగ చరిత్రలో మరో సువర్ణ అధ్యాయం లిఖించబడనుంది. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ స్పేస్ స్టార్టప్ 'స్కైరూట్ ఏరోస్పేస్' వారు రూపొందించిన దేశంలోనే మొట్టమొదటి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్ విక్రమ్ 1 ప్రయోగానికి సర్వం సిద్ధం చేసింది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రయోగాన్ని శనివారం శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి చేపట్టనున్నారు. ఈ రాకెట్ బాడీని పూర్తిగా కార్బన్ ఫైబర్ నానోకంపోజిట్ మెటీరియల్‌తో అత్యంత పటిష్టంగా, తక్కువ బరువుతో డిజైన్ చేశారు. రాకెట్‌లోని అత్యాధునిక ద్రవ ఇంధన ఆధారిత ఇంజన్లను అత్యాధునిక 3డీ ప్రింటింగ్ టెక్నాలజీతో స్కైరూట్ స్వయంగా అభివృద్ధి చేసింది.




ఈ రాకెట్ ద్వారా దేశీయ, అంతర్జాతీయ క్లయింట్లకు చెందిన పలు చిన్న ఉపగ్రహాలను లోఎర్త్ ఆర్బిట్ కక్ష్యలో ప్రవేశపెట్టనున్నారు. అంతరిక్ష ప్రయోగాల్లో ఖర్చును తగ్గించడంతో పాటు, ఉపగ్రహాలను వేగంగా కక్ష్యలోకి చేర్చేందుకు వీలుగా విక్రమ్ 1 రాకెట్‌ను రూపొందించినట్లుగా స్కైరూట్ ఏరోస్పేస్ సహవ్యవస్థాపకుడు పవన్ కుమార్ చందన తెలిపారు. ఈ ప్రయోగం సక్సెస్ అయితే.. అంతర్జాతీయ వాణిజ్య అంతరిక్ష విపణిలో భారత్ స్థానం మరింత బలోపేతం కానుంది.

# సేఫ్ సిటీతో.. మరింత భద్రత




**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** వేగంగా విస్తరిస్తున్న పట్టణీకరణ, పెరుగుతున్న జనాభా, సాంకేతిక పరిజ్ఞాన విస్తరణతో పాటు ప్రజల భద్రతకు కొత్త సవాళ్లు ఎదురవుతున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ పోలీస్ శాఖ అత్యాధునిక సాంకేతికతతో "సేఫ్ సిటీ ప్రాజెక్ట్" ను అమలు చేస్తోంది. ముఖ్యంగా మహిళలు, పిల్లలు, వృద్ధులు, పాదచారులు మరియు ప్రజలందరికీ సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడమే ఈ ప్రాజెక్ట్ లక్ష్యం. ఈ నేపథ్యంలో సేఫ్ సిటీ ప్రాజెక్టు అమలును మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) సి.వి. ఆనంద్, ఐపీఎస్ గురువారం డీజీపీ కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ పోలీస్ శాఖ ఉన్నతాధికారులతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**సాంకేతికత ఆధారంగా ..**

**సురక్షిత నగరం దిశగా చర్యలు..**

సేఫ్ సిటీ ప్రాజెక్టులో భాగంగా అత్యాధునిక సీసీటీవీ కెమెరాలు, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లు, ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, ఎమర్జెన్సీ రెస్పాన్స్ వ్యవస్థలు వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత సమర్థవంతంగా వినియోగిస్తూ నేరాల నివారణ, ట్రాఫిక్ నిర్వహణ, అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన స్పందనకు చర్యలు చేపట్టాలని డీజీపీ సూచించారు.

**మహిళల కోసం మరిన్ని**

**మొబైల్ షీ టాయిలెట్లు..**

మహిళల భద్రత, సౌకర్యానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తు ఇప్పటికే హైదరాబాద్ నగరంలో 12 మొబైల్ షీ టాయిలెట్లను ఏర్పాటు చేసింది. వీటికి అదనంగా మరో 12 షీ టాయిలెట్లను ఏర్పాటు చేసి మహిళలకు పరిశుభ్రమైన, సురక్షితమైన మరుగుదొడ్ల సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారులకు సూచించారు.

**షీ టీమ్స్, భరోసా సెంటర్లు పని తీరు భేష్..**

మహిళల భద్రత కోసం షీ టీమ్స్, భరోసా సెంటర్లు, హాక్‌ఐ యాప్, సేఫ్ ట్రావెల్ కార్యక్రమాలు, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు సమర్థవంతంగా అమలవుతున్నాయని డీజీపీ తెలిపారు. మహిళలు భయాందోళనలు లేకుండా నగరంలో పని చేసుకునేలా పరిస్థితిలు కల్పించాలని ఇందుకోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**నిఘా వ్యవస్థ మరింత బలోపేతం..**

తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ పోలీస్ శాఖ సంయుక్తంగా అమలు చేస్తున్న సేఫ్ సిటీ ప్రాజెక్టులో భాగంగా నగర భద్రతను మరింత పటిష్టం చేసేందుకు అత్యాధునిక సీసీటీవీ నిఘా వ్యవస్థను విస్తరిస్తున్నారు. ప్రాజెక్టు మొదటి దశలో మొత్తం 2,306 సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి ఇప్పటికే అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇందులో హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 974, సైబరాబాద్‌లో 574, రాచకొండ కమిషనరేట్‌లో 758 కెమెరాలు ఏర్పాటు చేసి సమర్థవంతంగా వినియోగిస్తున్నారు.

రెండో దశలో మొత్తం 862 సీసీటీవీ కెమెరాల ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో హైదరాబాద్‌లో 452, సైబరాబాద్‌లో 297, రాచకొండలో 113 కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. సేఫ్ సిటీ ప్రాజెక్టు ద్వారా ముఖ్యంగా మహిళలు, పిల్లలు, వృద్ధులకు మరింత సురక్షిత వాతావరణాన్ని కల్పించడంతో పాటు, నేరాలపై సత్వరమే చర్యలు తీసుకునేందుకు తెలంగాణ పోలీసులు సాంకేతిక ఆధారిత పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు.

**సీసీటీవీలు, ట్రాఫిక్ సిగ్నల్స్**

**పూర్తి స్థాయిలో పనిచేయాలి..**

నగరవ్యాప్తంగా ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలు ఎల్లప్పుడూ పనిచేసేలా పర్యవేక్షణను బలోపేతం చేయాలని డీజీపీ ఆదేశించారు. అదే విధంగా పాదచారుల భద్రత కోసం 77 ప్రాంతాల్లో పాదచారుల సిగ్నల్స్ ఉన్నట్లు అధికారులు వివరించారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన 404 ట్రాఫిక్ సిగ్నల్స్‌ను మరమ్మతులు చేసి పూర్తి స్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని డిజిపి జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు.

**క్యూర్ ప్రాంతాల్లో ట్రాఫిక్ నిర్వహణకు**

**ప్రత్యేక చర్యలు..**

ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉండే క్యూర్ ప్రాంతంలో ప్రత్యేక ట్రాఫిక్ నిర్వహణ చర్యలు చేపట్టాలని, పాదచారులకు సురక్షితంగా రోడ్లు దాటే అవకాశాలు కల్పించాలని డీజీపీ సూచించారు. సేఫ్ సిటీ, మహిళల భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాల నివారణ, డ్రగ్స్ నిర్మూలన వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు నగరంలో అందుబాటులో ఉన్న ఆడియో ప్రచార వాహనాలను మరింత సమర్థవంతంగా వినియోగించాలని అధికారులకు సూచించారు. సాంకేతికత ఆధారిత పోలీసింగ్ ద్వారా నేరాలను అరికట్టడం, నేరస్థులను వేగంగా గుర్తించడం, బాధితులకు త్వరితగతిన సహాయం అందించడం వంటి అంశాల్లో తెలంగాణ దేశంలోనే ఆదర్శంగా నిలుస్తోందని డీజీపీ పేర్కొన్నారు. సేఫ్ సిటీ ప్రాజెక్టు ద్వారా పోలీస్ శాఖ, జీహెచ్ఎంసీ, ఇతర ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ హైదరాబాద్‌ను మరింత సురక్షితమైన, ప్రజలకు అనుకూలమైన నగరంగా తీర్చిదిద్దాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో డీజీపీ శ్రీ సి.వి. ఆనంద్ తో పాటు గా, డీజీ (లా అండ్ ఆర్డర్) మహేష్ భగవత్, డీజీ ఉమెన్ సేఫ్టీ వింగ్ చారు సిన్హా, ఐజీ పీ&ఎల్. గజారావు భూపాల్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనర్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ రెడ్డి , మల్కాజి గిరి పోలీస్ కమిషనర్ సుమతి, ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి, మహిళా శిశు సంక్షేమ శాఖ కమిషనర్ శృతి ఓజా, అలాగే పోలీస్, జీహెచ్ఎంసీ, మున్సిపల్ పరిపాలన, రవాణా మరియు ఇతర సంబంధిత శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# గురుకులాలే ప్రభుత్వ ప్రతిష్ఠ

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, భోజనం, తాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, అక్కడికక్కడే పరిష్కరించే ఉద్దేశంతో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. గురువారం తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని చైతన్యపురి మహిళా న్యాయ కళాశాల, ఇబ్రహీంపట్నం రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల, సరూర్‌నగర్ బాలికల గురుకుల పాఠశాలను మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో ముఖాముఖిగా మాట్లాడిన మంత్రి వారి విద్యాభ్యాసం, హాస్టల్ నిర్వహణ, భోజనం, తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రత, బోధన తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు ప్రధానంగా మూడు విద్యాసంస్థలు ఒకే ప్రాంగణంలో ఉండటం వల్ల తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. విద్యార్థుల సమస్యను అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్న మంత్రి వెంటనే రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి, మిషన్ భగీరథ పైప్‌లైన్ ద్వారా శాశ్వత తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు, అప్పటి వరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అనంతరం హాస్టల్ గదులు, డైనింగ్ హాల్, వంటశాల, తరగతి గదులు, గ్రంథాలయం, ప్రయోగశాలలు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్య నిర్వహణను మంత్రి స్వయంగా పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యత, మెనూ అమలు, పరిశుభ్రత ప్రమాణాలపై ప్రత్యేకంగా ఆరా తీశారు. మెనూ ప్రకారమే రుచికరమైన, నాణ్యమైన భోజనం అందిస్తున్నారని విద్యార్థినులు మంత్రికి తెలిపారు. విద్యార్థులతో ఆత్మీయంగా మాట్లాడిన మంత్రి, విద్యాసంస్థల్లో ఏ చిన్న సమస్య ఉన్నా నిర్భయంగా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. విద్యార్థుల అభిప్రాయాలు, సూచనలు ప్రభుత్వానికి ఎంతో విలువైనవని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించిన మంత్రి, విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో తమ పిల్లలను గురుకుల విద్యాసంస్థలకు పంపిస్తున్నందున వారి విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల విద్యార్థుల ఉన్నత విద్యాభివృద్ధికి అత్యున్నత ప్రాధాన్యం ఇస్తున్నారని మంత్రి తెలిపారు. అదే ఆలోచనతో ఆధునిక సౌకర్యాలతో కూడిన ఇంటిగ్రేటెడ్ గురుకుల విద్యాసంస్థల నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు విద్యార్థుల సంక్షేమం కోసం డైట్ ఛార్జీలు, కాస్మెటిక్ ఛార్జీలను గణనీయంగా పెంచి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని గుర్తు చేశారు."విద్య ద్వారానే సమాజంలో సమానత్వం సాధ్యమవుతుందని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చూపిన మార్గంలోనే రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. గురుకుల విద్యాసంస్థలు సామాజిక మార్పుకు కేంద్రాలుగా నిలవాలి. ప్రతి ఉపాధ్యాయుడు తమ బాధ్యతను సేవాభావంతో నిర్వర్తించి విద్యార్థులను ఉన్నత లక్ష్యాల వైపు నడిపించాలి" అని మంత్రి పేర్కొన్నారు. విద్యార్థుల సంక్షేమానికి సంబంధించిన ప్రతి అంశంపై ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తుందని, ఆకస్మిక తనిఖీలు కూడా అదే లక్ష్యంతో నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. సమస్యలు గుర్తించిన చోట వెంటనే పరిష్కార చర్యలు చేపట్టి, గురుకులాలను దేశంలోనే ఆదర్శ విద్యాసంస్థలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. ఈ తనిఖీలో TGSWREIS (FAC) కార్యదర్శి కంభంపాటి శారద, స్టేట్ ఆఫీసర్ నిర్మల, ప్రిన్సిపాల్ సరూర్నగర్ గర్ల్స్ స్కూల్ కృష్ణ ప్రభలా , డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్ లు పాల్గొన్నారు.

## తెలంగాణ వ్యవసాయ శాఖకు అరుదైన ఘనత

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** రాష్ట్ర వ్యవసాయ శాఖ మరో ప్రతిష్టాత్మక విజయాన్ని సొంతం చేసుకుంది. రాజేంద్రనగర్‌లోని ఎరువుల నియంత్రణ ఉత్తర్వులు (ఎఫ్సీవో) ప్రయోగశాలకు నేషనల్ అక్రెడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లాబొరేటరీస్ (ఎన్ఏబీఎల్) గుర్తింపు లభించింది. ఈ గుర్తింపుతో ఈ ప్రయోగశాల అంతర్జాతీయ నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పనిచేస్తోందని అధికారికంగా ధృవీకరించారు. ఫలితంగా రైతులకు అందే ఎరువుల నాణ్యత పరీక్షలు ఇకపై మరింత ఖచ్చితత్వంతో సాగనున్నాయి. రాజేంద్రనగర్ ఎఫ్‌సీఓ ప్రయోగశాల ప్రమాణాలను విజయవంతంగా అమలు చేసి, ఎరువుల రసాయన విశ్లేషణలో అంతర్జాతీయ సాంకేతిక సామర్థ్యాన్ని నిరూపించుకుంది. రాష్ట్ర వ్యవసాయ శాఖ పరిధిలో పనిచేస్తున్న మొత్తం 9 నాణ్యత నియంత్రణ ప్రయోగశాలల్లో (ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు) ఎన్ఏబీఎల్ గుర్తింపు సాధించిన మొదటి ప్రయోగశాల ఇదే కావడం విశేషం. ప్రస్తుతం ఈ కేంద్రంలో మ్యూరియేట్ ఆఫ్ పొటాష్, సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ (ఎస్ఎస్ పీ- పౌడర్, గ్రాన్యులర్) ఎరువుల నాణ్యత పరీక్షలకు ఈ గుర్తింపు లభించింది. ఈ ప్రతిష్టాత్మక గుర్తింపు పత్రాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా వ్యవసాయ శాఖ కార్యదర్శి కె. సురేంద్ర మోహన్, డైరెక్టర్ డాక్టర్ బి. గోపి, ఇతర ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ అంతర్జాతీయ గుర్తింపు తెలంగాణ ప్రభుత్వానికి, వ్యవసాయ శాఖకు పెద్ద మైలురాయిగా నిలిచింది. ఇది రాష్ట్రంలో నాణ్యత నియంత్రణ వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే కాకుండా, మార్కెట్లో లభించే ఎరువుల నాణ్యతపై రైతుల్లో నమ్మకాన్ని రెట్టింపు చేయనుంది. రాబోయే రోజుల్లో అన్ని ల్యాబ్‌లను అంతర్జాతీయ స్థాయికి చేర్చి రైతు సంక్షేమానికి కట్టుబడి ఉంటామని వ్యవసాయ శాఖ స్పష్టం చేసింది.

**మిగిలిన ల్యాబ్‌లకూ గుర్తింపు తెస్తాం: మంత్రి**

'రాజేంద్రనగర్ ఎఫ్‌సీఓ ల్యాబ్‌కు అంతర్జాతీయ గుర్తింపు రావడం రాష్ట్ర వ్యవసాయ శాఖకు గర్వకారణం. రైతులకు నాణ్యమైన వ్యవసాయ ఉత్పాదకాలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. ఇదే తరహాలో రాష్ట్రంలోని మిగిలిన అన్ని వ్యవసాయ నాణ్యత నియంత్రణ ప్రయోగశాలలకు కూడా దశలవారీగా గుర్తింపు వచ్చేలా చర్యలు వేగవంతం చేయాలి.' అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

## జైల్లో ఖైదీల ప్రేమాయణం

**నేషనల్ బ్యూరో :** నేరాలకు పాల్పడి జీవిత ఖైదు అనుభవిస్తున్న ఇద్దరు ఖైదీలు కొత్త జీవితాన్ని ప్రారంభించనున్నారు. జైలులో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారడంతో పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్న ఇద్దరు జీవిత ఖైదీలకు రాజస్థాన్ హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వివాహం అనేది ప్రతి వ్యక్తికి ఉన్న ప్రాథమిక హక్కు అని స్పష్టం చేసిన న్యాయస్థానం, చట్టబద్ధమైన నిబంధనలకు అనుగుణంగా రాజస్థాన్‌లోని ఓపెన్ జైలు క్యాంప్‌లో వారి వివాహం నిర్వహించుకోవచ్చని ఆదేశించింది. రాజస్థాన్‌లోని నాగౌర్ జిల్లాకు చెందిన మూలారామ్ కుటుంబంతో కలిసి వ్యవసాయం చేసేవాడు. అతడి కుటుంబానికి పొరుగువారితో చాలా కాలంగా భూవివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో అతడు 2017లో తన పొరుగింటికి చెందిన ఓ యువకుడిని మోటార్‌సైకిల్‌పై తీసుకెళ్లాడు. అనంతరం అతడి మృతదేహం ఓ నీటి తొట్టిలో లభించింది. ఈ ఘటనపై నమోదైన హత్య కేసులో విచారణ జరిపిన కోర్టు, మూలారామ్‌ను దోషిగా తేల్చి 2023 ఆగస్టులో జీవిత ఖైదు విధించింది. శిక్ష అనంతరం అతడిని జోధ్‌పూర్ సమీపంలోని మండోర్ ఓపెన్ జైలు క్యాంప్‌కు తరలించారు. గత రెండేళ్లుగా మూలారామ్ ఆ క్యాంప్‌లో ఖైదీల సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. మరోవైపు జోధ్‌పూర్‌లోని ఘంటాఘర్ ప్రాంతానికి చెందిన కౌశల్‌రాజ్ అరోరాను 2016లో సీమా ఘడ్సే వివాహం చేసుకుంది. అయితే తన ఇష్టానికి వ్యతిరేకంగా ఆ పెళ్లి జరిగిందనే అసంతృప్తితో సీమ ఉండేది. దాంతో పెళ్లైన రెండు నెలలకే నిద్రిస్తున్న భర్త చేతుల నరాలను పదునైన ఆయుధంతో కోసి హత్య చేసింది. మొదట ఇంట్లోకి దొంగ చొరబడి ఆ ఘటనకు పాల్పడ్డాడని పోలీసులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసింది. కానీ విచారణలో అసలు విషయం బయటపడింది. దీంతో 2019లో కోర్టు ఆమెను కూడా దోషిగా తేల్చి జీవిత ఖైదు విధించింది. జైలు జీవితం గడుపుతున్న సమయంలో మూలారామ్, సీమా మధ్య పరిచయం ఏర్పడింది. కాలక్రమేణా అది ప్రేమగా మారింది. భవిష్యత్తులో కలిసి జీవితాన్ని కొనసాగించాలని ఇద్దరూ నిర్ణయించుకున్నారు. ప్రస్తుతం సీమా 40 రోజుల పెరోల్‌పై బయట ఉండగా, మూలారామ్ తరపు న్యాయవాది కలురామ్ భాటి హైకోర్టును ఆశ్రయించి వివాహానికి అనుమతి కోరారు. ఈ వివాహం ఇద్దరి పునరావాసం, సంస్కరణ ప్రక్రియలో కీలక పాత్ర పోషిస్తుందని కలురామ్ పేర్కొన్నారు. కుటుంబ జీవితం గడిపే అవకాశం కల్పించడం ద్వారా వారు సమాజంలో తిరిగి కలిసిపోయే అవకాశాలు మెరుగుపడతాయని వాదించారు. అలాగే ఖైదీలకు కూడా వివాహం చేసుకునే హక్కు, కుటుంబాన్ని ఏర్పాటు చేసుకునే హక్కు ఉందని గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పులను కూడా ప్రస్తావించారు. విచారణ సందర్భంగా ప్రభుత్వం సమర్పించిన నివేదికలో మూలారామ్, సీమా ఇద్దరూ పరస్పర అంగీకారంతో వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నట్లు కోర్ట్ ధ్రువీకరించింది. వారి మధ్య సహజీవన సంబంధం ఏర్పడిన విషయాన్ని కూడా నివేదికలో ప్రస్తావించింది. జైలు నిబంధనలకు అనుగుణంగా ఓపెన్ జైలు క్యాంప్‌లో వివాహం నిర్వహించడానికి ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం లేదని పబ్లిక్ ప్రాసిక్యూటర్లు కోర్టుకు తెలిపారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు డివిజన్ బెంచ్ కీలక వ్యాఖ్యలు చేసింది. వివాహం అనేది సమాజంలో అత్యంత ప్రాథమికమైన వ్యవస్థ అని పేర్కొంది. నేరానికి శిక్ష పడిందనే కారణంతో ఖైదీలను వివాహం చేసుకునే హక్కు నుంచి దూరం చేయలేమని స్పష్టం చేసింది. పరస్పర అంగీకారంతో ఇద్దరు వివాహం చేసుకోవాలనుకుంటే, చట్టం కూడా వారికి ఆ అవకాశాన్ని కల్పిస్తుందని వ్యాఖ్యానించింది. దీంతో మూలారామ్, సీమా వివాహానికి హైకోర్టు అనుమతి మంజూరు చేసింది. మండోర్ ఓపెన్ జైలు క్యాంప్‌లోనే చట్టబద్ధంగా వివాహ వేడుక నిర్వహించాలని ఆదేశించింది. ఈ వేడుకకు ఇరువైపుల కుటుంబ సభ్యులు కలిపి గరిష్ఠంగా 21 మంది అతిథులు, ఒక పూజారి హాజరుకావచ్చని పేర్కొంది. అవసరమైతే అతిథుల సంఖ్య పెంచే అంశాన్ని జైలు అధికారులు పరిశీలించవచ్చని తెలిపింది. వివాహ తేదీని ముందుగానే జైలు యంత్రాంగానికి తెలియజేయాలని, వేడుకకు సంబంధించిన మొత్తం ఖర్చును మూలారామే భరించాలని కోర్టు ఆదేశించింది. జైలు నిబంధనలకు భంగం కలగకుండా, భద్రతా ప్రమాణాలు పాటిస్తూ వివాహం నిర్వహించాలని స్పష్టం చేసింది.







# వారాహి జ్యువెల్స్ 3వ వార్షికోత్సవం సందర్భంగా
# ప్రత్యేక ఆభరణాల ప్రదర్శన



**హైదరాబాద్, స్నేహిత ఎక్స్ ప్రెస్:** ప్రముఖ ఆభరణాల సంస్థ వారాహి జ్యువెల్స్ తమ 3వ వార్షికోత్సవ వేడుకలను జూలై 16 నుంచి 19 వరకు కావూరి హిల్స్‌లోని షోరూమ్‌లో నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు సందీప్ కరణం తెలిపారు. ఈ సందర్భంగా వేలాది సరికొత్త డిజైన్లతో కూడిన ప్రత్యేక జ్యువెలరీ ప్రదర్శనను మరియు సేల్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ నాలుగు రోజుల ప్రదర్శనను మల్లారెడ్డి విద్యాపీఠం వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రీతి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై దీపప్రజ్వలనతో ప్రారంభించారు. హైదరాబాద్, విజయవాడ, తిరుపతి నగరాల్లో సేవలందిస్తున్న వరాహి జ్యువెల్స్ నాణ్యత, విశ్వసనీయత, వినియోగదారుల సేవలకు ప్రాధాన్యతనిస్తూ వధువులు, కుటుంబాల ఆదరణ పొందుతోందన్నారు. సంప్రదాయ కళాత్మకతకు ఆధునికతను జోడించి డైమండ్, కుందన్, పోల్కీ, నక్ష్, టెంపుల్ జ్యువెలరీతో పాటు డైలీ వేర్ ప్రత్యేక కలెక్షన్లను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి రెడ్డి గారు మాట్లాడుతూ ప్రదర్శనలో ఉన్న వాటిలో చాలా వెరైటీస్ బాగున్నాయి బంగారం, వెండి, వెండి మీద బంగారం పూత వంటి ఎన్నో వెరైటీలు ప్రదర్శనలో ఉంచడంతోపాటు సేల్ కూడా నిర్వహించడం ఆనందంగా ఉంది వీరి డిజైన్స్ చాలా ప్రత్యేకం గా అందర్నీ ఆకట్టుకునేలా ఉన్నాయని బంగారం ప్రియులు అందరూ వచ్చి ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా వినియోగదారుల కోసం ప్రత్యేక ఆఫర్లు, సరికొత్త డిజైన్ల ఆభరణాలను అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. "ఆభరణాలు మాత్రమే కాదు... జీవితాంతం నిలిచే మధుర జ్ఞాపకాలను అందించడమే మా లక్ష్యం" అని సందీప్ కరణం తెలిపారు.







# దిల్‌సుఖ్‌నగర్‌లో కుబేరా సిల్క్స్ 4వ బ్రాంచ్ ప్రారంభం

**ముఖ్య అతిథిగా హాజరైన నటి అనన్య నాగళ్ల**

**హైదరాబాద్, స్నేహిత ఎక్స్ ప్రెస్:** తెలంగాణలో పట్టు చీరలు, బ్రైడల్ కలెక్షన్స్, డిజైనర్ చీరలు, సంప్రదాయ వస్త్రాలకు ప్రసిద్ధి చెందిన కుబేరా సిల్క్స్ తన నాలుగో బ్రాంచ్‌ను దిల్‌సుఖ్‌నగర్ లోని కోణార్క్ థియేటర్ ఎదురుగా ఉన్న ఎస్.ఆర్.ఆర్. కాంప్లెక్స్‌లో ప్రముఖ సినీ నటి అనన్య నాగళ్ల ప్రారంభించారు. ఈ సందర్భంగా కుబేరా సిల్క్స్ వ్యవస్థాపకులు ఎం. శ్యాంసుందర్, జి. శ్రీనివాస్, డా. జి. షాలిని మాట్లాడుతూ, నాణ్యత, విశ్వసనీయత, అందుబాటు ధరలతో వినియోగదారులకు ఉత్తమమైన షాపింగ్ అనుభవాన్ని అందించాలనే లక్ష్యంతో హైదరాబాద్‌లో విస్తరణ కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. కొత్త బ్రాంచ్‌లో పట్టు చీరలు, బ్రైడల్ కలెక్షన్స్, డిజైనర్ చీరలు, ఫ్యాన్సీ వేర్, సంప్రదాయ దుస్తులు విస్తృతంగా అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రత్యేక ప్రారంభ ఆఫర్లు పట్టు చీరలు రూ.999 నుంచే ఎంపిక చేసిన చీరలపై ఒకటి కొనుగోలు చేస్తే మరో చీర రూ.1కే రూ.5,000కు పైగా పట్టు చీరలు కొనుగోలు చేసిన వారికి 50 శాతం విలువ మేర చీరలు ఉచితం రూ.2,000కు పైగా డ్రెస్సులు కొనుగోలు చేసిన వారికి రూ.800 విలువైన డ్రెస్ మెటీరియల్ ఉచితం డజన్ పట్టు చీరల ప్రత్యేక ప్యాక్ రూ.5,000కే ఆషాఢం మెగా సేల్ సందర్భంగా అన్ని బ్రాంచ్‌లలో గరిష్టంగా 50 శాతం వరకు తగ్గింపులు ఉంటాయని తెలిపారు.






# రాష్ట్రంలో విద్యుత్, నీటి సంక్షోభం

- **రాష్ట్రంలో నీటి నిల్వల సామర్థ్యం 1059 టీఎంసీలు**
- **ప్రస్తుతం ఉన్నది కేవలం 351 టీఎంసీలే**
- **33.17 శాతం నీటి నిల్వలతోనే రాష్ట్రం గడపాల్సిన దుస్థితి**
- **హైడల్ పవర్ లేదు.. థర్మల్ పవర్ కోసం బొగ్గు నిల్వలు లేవు**
- **కరువుపై ముందస్తు హెచ్చరికలను విస్మరించిన ప్రభుత్వం**
- **కమీషన్లు, కొట్లాటలపై ఉన్న ధ్యాస పాలనపై లేదు**
- **కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ మాజీమంత్రి హరీష్‌రావు నిప్పులు**

**స్నేహిత ఎక్స్ ప్రెస్, తెలంగాణ బ్యూరో :** రాష్ట్రంలో నెలకొన్న నీటి కటకట, విద్యుత్ సంక్షోభంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలోని ప్రాజెక్టులు అడుగు మట్టానికి చేరుకున్నా, ప్రభుత్వం కనీస ముందస్తు చర్యలు తీసుకోలేదని ఆయన మండిపడ్డారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్ల రాష్ట్రం అంధకారంలోకి, కరువులోకి వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని రిజర్వాయర్ల పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 1059 టీఎంసీలు కాగా, ప్రస్తుతం అందులో ఉన్నది కేవలం 351 టీఎంసీలు మాత్రమేనని, ఇది మొత్తం సామర్థ్యంలో కేవలం 33.17 శాతం అని ఆయన గుర్తుచేశారు.

**నీటిపై ధ్యాస లేదు.. పవర్ ఉత్పత్తిపై శ్రద్ధ లేదు**

"ఒకవైపు నీటి నిల్వలు నిండుకుంటున్నా, ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ప్రాజెక్టుల్లో నీటిని నింపడంలో విఫలమై, హైడల్ పవర్ ఉత్పత్తిని పూర్తిగా గాలికొదిలేశారు. నీటి మీద ధ్యాస లేని ప్రభుత్వం, కనీసం థర్మల్ పవర్ ఉత్పత్తి కోసం బొగ్గు నిల్వలను కూడా సకాలంలో సమకూర్చుకోలేకపోయింది" అని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. హైడల్ పవర్ ఉత్పత్తి చేద్దామంటే రిజర్వాయర్లలో నీళ్లు నింపలేదు, థర్మల్ పవర్ ఉత్పత్తి చేద్దామంటే కనీసం బొగ్గు నిల్వలు కూడా పెట్టుకోలేదని ఆయన దుయ్యబట్టారు. దీనికి అనుగుణంగా ప్రభుత్వం ఏం ఏర్పాట్లు చేసింది? ఏం ముందస్తు చర్యలు తీసుకుందో ప్రజలకు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

**ముందస్తు హెచ్చరికలను గాలికొదిలేశారు**

రాష్ట్రంలో కరువు పరిస్థితులు వచ్చే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎమ్.డి) ఎప్పటి నుంచో హెచ్చరిస్తున్నా, ప్రభుత్వం కంటి తుడుపు చర్యలు కూడా చేపట్టలేదని విమర్శించారు. "వాతావరణ శాఖ కరువు వస్తుందని ఎప్పటి నుంచో చెబుతోంది. హెచ్చరికలు జారీ చేస్తున్నా, ప్రభుత్వం ఎందుకు అప్రమత్తం కాలేదు? వేసవి, వానాకాలం ప్రారంభ దశలోనే నీటిని ఆదా చేసే చర్యలు ఎందుకు చేపట్టలేదు? ఆరు నెలల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీల కంటే, ప్రాజెక్టుల నిర్వహణలో వైఫల్యం చెందడం గమనార్హం" అని హరీశ్ రావు దుయ్యబట్టారు.

**కమీషన్ల కక్కుర్తి.. ప్రజల కష్టాలు**

ప్రభుత్వ ప్రాధాన్యతలు పూర్తిగా మారిపోయాయని హరీశ్ రావు విమర్శించారు. "నీటిపారుదల వ్యవస్థను పటిష్టం చేయడంపై లేదా రాష్ట్రంలో విద్యుత్ వెలుగులను నింపడంపై ఉన్న శ్రద్ధ.. కాంగ్రెస్ నాయకులకు కమిషన్ల మీద, ఒకరి మీద ఒకరు కొట్లాటల మీదనే ఉంది. రాష్ట్రాన్ని పాలించాల్సిన వారు, కమీషన్ల కోసం ప్రాకులాడుతూ, ప్రాజెక్టుల నిర్వహణను గాలికి వదిలేశారు. దీనికి అనుగుణంగా ఎటువంటి ఏర్పాట్లు చేశారు? ఏం ముందస్తు చర్యలు తీసుకున్నారు? రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలి" అని హరీశ్ రావు డిమాండ్ చేశారు. తక్షణమే ప్రాజెక్టుల వారీగా నీటి నిర్వహణపై శ్వేతపత్రం విడుదల చేయాలని, విద్యుత్ సంక్షోభం తలెత్తకుండా బొగ్గు నిల్వలను యుద్ధ ప్రాతిపదికన పెంచాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.



Printed, Published, Edited & Owned by **Rathod Vinod Kumar**, Printed At Falcon Printing Press, **SNEHITHA PUBLICATIONS** #1-2-201,Shop No 2, Khan Street, Zaheerabad Town,Sangareddy Dist: Pin :502220, State :Telangana, Published at SNEHITHA PUBLICATIONS #1-2-201,Shop No 2, Khan Street, Zaheerabad, 502220, Dist: Sangareddy, T.S., Editor: **Rathod Vinod kumar**, RNI. No. APTEL/2009/29308, Cell: 9550021491,8341021491Mail :expresstelugudaily@gmail.com